క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



గురజాల : నగర పంచాయతీ పరిధిలో ఆదివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందని కమిషనర్ మోహన శ్రీనివాస్ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మురుగు కాలువల్లో చెత్త చెదారం శుభ్రం చేయడంతోపాటు అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించడం, దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ వంటివి చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

గురజాల : శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం వేడుకలు నిర్వహించనున్నారు. యాదవ కులదైవం శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక ముక్కంటేశ్వరస్వామి దేవాలయం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూడా వేడుకలు నిర్వహించనున్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శివ ప్రసాద్ అతని భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్‌ఐ మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు డ్రైవర్ గౌరీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్ పేర్కొన్నారు.

విశ్వాసంతో క్రీస్తును ఆరాధించాలి



విజయపురిసౌత్: విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా అందుతాయని సాగర మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. విజయపురిసౌత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

రైల్వే బ్రిడ్జి గడ్డర్లు ఏర్పాటు



పిడుగురాళ్ల: పట్టణంలోని అద్దంకి నార్కెట్‌పల్లి బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి రెండవ వైపు పనులు పూర్తి కావచ్చాయి. ఆదివారానికి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఆరు గడ్డర్ల ఏర్పాటుకు ఐదు గడ్డర్లను ఏర్పాటు చేశారు. పొక్లెయిన్ల సహాయంతో నాలుగు, ఐదు రోజుల నుంచి ఈ రైల్వే బ్రిడ్జిపై గడ్డర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఒక వైపు పూర్తి చేయటంతో వాహనాల రాకపోకలు నిర్వహిస్తూనే రెండవ వైపు ఈ రైల్వే గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే అధికారుల ఉమ్మడి నేతృత్వంలో ఈ రైల్వే గడ్డర్ల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. ఈ గడ్డర్ల ఏర్పాట్లు పూర్తి అయితే అద్దంకి నార్కెట్‌పల్లి హైవే బ్రిడ్జి పూర్తిస్థాయిలో పూర్తి అయినట్లే.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుర్గి: మాచర్ల పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ప్రాంతంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న వ్యాపారి మున్నా శ్రీను (48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం రాత్రి దుర్గి మండలంలోని ఆత్మకూరు గ్రామ సమీపంలో శ్రీను నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బంధువులు నరసరావుపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నరసరావుపేటలో చదువుతున్న కుమార్తెను కలిసి తిరిగి మాచర్లకు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, శివయ్యల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొని గ్రామం అభివృద్ధి చెందాలని గ్రామస్తులు ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

చట్టాలు కఠినంగా రూపొందించాలి



సమాజంలో మహిళల భద్రతకు కేంద్ర ప్రభుత్వం చట్టాలను కఠినంగా రూపొందించాలి. వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను నివారణకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చి రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం సభ్యసమాజం తలదించుకునే విషయం. ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.
– డాక్టర్ హేమ, పీహెచ్‌సీ, రెంటచింతల



చట్టాలంటే భయం లేదు



మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడాలంటే భయపడేలా దోషులను శిక్షించాలి. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తే మహిళల జోలికి రాకుండా ఉంటారు. చట్టం ఎవరికి చుట్టం కాదని నిరూపించాల్సిన సమయం వచ్చింది. కోల్‌కతాలో మహిళ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను ఉరి తీయాలి. మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.
– కర్నాటి వరలక్ష్మి, లక్ష్మీ గాయత్రీ నర్సింగ్ హోం, నారాయణపురం



ఎర్రపాలెం ప్రధాన రహదారి వెంట వ్యర్థాలు



మురుగు పోయేదారి లేక కాలువలో నిల్వ ఉన్న దృశ్యం



కొనసాగుతున్న వైద్య శిబిరం

పారిశుద్ధ్యం అధ్వానం..

అదుపులోకి రాని డయేరియా

- పెరుగుతున్న డయేరియా బాధితులు
- నేడు మరో మూడు కేసులు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. ఆదివారం కూడా మూడు కేసులు వెలుగుచూశాయి. వారిలో ఇద్దరిని నరసరావుపేట జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మరొకరు నరసరావుపేటలోని ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. ఇదిలా ఉంటే గతంలో డయేరియా వచ్చిన వారిలో ఇంకా 7 మంది కోలుకోవాల్సి ఉంది. కాగా ఇప్పటికే ఇద్దరు మృత్యువాత పడ్డారు. వయసు పైబడిన వారు అందులో వేరే అనారోగ్య సమస్యలుంటే.. అలాంటి వారు కోలుకోవడం కొంచెం కష్టంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

20 రోజులుగా నమోదవుతున్న కేసులు

5వ తేదీ గ్రామంలో డయేరియా కేసులు వెలుగుచూస్తున్నాయి. అంటే గత 20 రోజుల నుంచి రోజూ డయేరియా కేసులు వస్తూనే ఉన్నాయి. అయినా గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు నామమాత్రంగానే కన్పిస్తున్నాయి. గ్రామ ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. సైడు కాల్వలున్న చోట కూడా మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఎక్కడ మురుగు అక్కడే పేరుకుపోయింది. దీనికి తోడు గ్రామం మధ్యలో ఉన్న ఇసుక వాగు వ్యర్థాలతో నిండిపోయింది. దానికి తోడు జమ్ము గడ్డి పెరిగి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి.



గ్రామం మధ్యలో కలుషిత ఇసుక వాగు

- ఆర్డీవో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి గత వారంలో గ్రామాన్ని సందర్శించారు. ఆ రోజే కాని తర్వాత గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదు. దోమల వల్ల జ్వరాల సంఖ్య పెరుగుతోంది. నాట్లు వేయడానికి, ఇతర పొలం పనులకు వెళ్లే వారు ఇంటి నుంచి సురక్షిత నీటిని తీసుకెళ్లాలని పొలాల్లో కలుషిత నీరు తాగడం వల్ల సమస్యలు వస్తున్నాయని వైద్య ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతూనే ఉంది. ఆదివారం వైద్య శిబిరానికి వివిధ అనారోగ్య సమస్యలతో ఏడుగురు వచ్చారు, వారిలో ఒక మైల్డ్ డయేరియా కేసు కూడా ఉంది. ప్రతి ఏటా ఇదే సీజన్‌లో ఈ గ్రామంలోనే డయేరియా కేసులు గత మూడేళ్లుగా వెలుగుచూస్తున్నాయి. దీనికి కారణాలను అన్వేషించి నివారణ చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కన్పిస్తోంది.

ఏపీఆర్‌జేసీలో ఉచిత మెడికల్ క్యాంపు



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని సాగర్ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, డెంటల్, స్కిన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, రుమటాలజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. 50 మందికి కళ్ల పరీక్షలు చేసి 20 మందికి కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ పరివార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, జనరల్ సెక్రటరీ వీరనంది, ట్రెజరర్ విజయకుమార్, క్యాంపు కో–ఆర్డినేటర్ డాక్టర్ చక్రపాణి, వైస్ ప్రెసిడెంట్ సైదారెడ్డి, నాగచారి, పూర్వ విద్యార్థి రిటైర్డ్ డీజీపీ వెంకటేష్, దంత వైద్యులు వివేకానంద వర్ధన్, ప్రిన్సిపాల్ సరోజిని, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిట్టంబండలో పోలీస్ పికెట్

వినుకొండ(నూజెండ్ల): పిట్టంబండ గ్రామంలో వినుకొండ సి.ఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రంజిత్ సింగ్‌పై తెలుగుదేశం పార్టీ నాయకుడు మక్కెన స్వామి దాడిచేయడం, మళ్లీ వైఎస్సార్ సీపీ నాయకులు దాడులు చేశారనే నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి. ముందస్తు చ ర్యల్లోభాగంగా ఎటాంటి అవాంచనీయ ఘటన లు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

చదువు కొనసాగింపునకు చక్కటి అవకాశం

- ఓపెన్ పది, ఇంటర్‌కి దరఖాస్తుల ఆహ్వానం
- 14 సంవత్సరాలు నిండిన వారు 10వ తరగతి
- 15 సంత్సరాలు నిండిన వారు ఇంటర్‌లో చేరవచ్చు
- దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్ల, మాచవరంలో ఓపెన్ స్కూల్ కేంద్రాలు

దాచేపల్లి : చదువు మానేసిన వారికి.. కనీసం రాయడం.. చదవడం వచ్చిన వారికి సువర్ణావకాశం ఓపెన్ స్కూల్. చదువుకోవాలని ఉన్నప్పటికీ సహకరించని కుటుంబ ఆర్థిక పరిస్థితులు.. అందుబాటులో పాఠశాలలు లేకపోవటం తదితర కారణాలతో చదువును ఆపేసిన వారికి ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా మరోసారి చదువుకునే వెసులుబాటు కల్పించింది. మళ్లీ చదువులు కొనసాగించి బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకునేందుకు ఓపెన్ స్కూల్ ఎంతో దోహదపడుతుంది. ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ చదువుకునేందుకు 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బడి బయట ఉన్న విద్యార్థులు, 14, 15 సంవత్సరాలు దాటిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదువుకోవచ్చు. గురజాల నియోజకవర్గంలో 10వ తరగతికి దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్ల, మాచవరం హైస్కూల్స్.. ఇంటర్‌కు నారాయణపురం, గురజాల, పిడుగురాళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెంటర్‌లను ఏర్పాటు చేశారు.



నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ కేంద్రం

ప్రవేశానికి అర్హతలు ఇలా...

10వ తరగతికి 14 సంవత్సరాలు నిండి చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులు. పదవ తరగతి ఫెయిల్ అయిన వారికి, బడి మధ్యలో మానేసిన వారికి అవకాశం. గరిష్ట వయో పరిమితి లేదు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, ఒరియా మాధ్యమాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

- ఒకసారి అడ్మిషన్ తరువాత 5 సంవత్సరాల్లో తొమ్మిది సార్లు పరిక్ష రాసే అవకాశం ఉంటుంది. ఒకేసారి అన్ని సబ్జెక్ట్‌లలో పరీక్షకు హాజరు కావాలనే నియమం లేదు. నిర్ణీత 5 సంవత్సరాల్లో కోర్సు పూర్తి చేస్తే సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. ఈ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది.
- ఇంటర్మీడియట్ చదివేందుకు ఆగస్టు 31, 2024 నాటికి 15 సంవత్సరాలు నిండాలి. 10వ తరగతి పాసై ఉండాలి. ఇంటర్ ఫెయిల్, మధ్యలో చదువు ఆపేసిన వారు చేరవచ్చును. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాలను ఎంపిక చేసుకునే అవకాశం.

దరఖాస్తు విధానం ఇలా...

ఇంటర్‌నెట్ సెంటర్ ద్వారా లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా లేదా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తిగత సెల్ నంబర్, ఆధార్ కార్డు దరఖాస్తులో నమోదు చేయాలి.

- ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లుగా గుర్తించిన జిల్లా పరిషత్ హైస్కూల్స్, ప్రభుత్వ జూనియర కళాశాలల్లో 30 రోజుల ముఖాముఖి తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్ సైన్స్ సబ్జెక్ట్‌లకు 24 ప్రాక్టికల్ తరగతులు నిర్వహించబడతాయి.
- 10వ తరగతి ఒక సంవత్సరం, ఇంటర్‌కు రెండు సంవత్సరాల కాల వ్యవధి ఉంది.
- 10వ తరగతికి ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాలి. జనరల్ కేటగిరీ పురుషులకు అడ్మిషన్ ఫీజు రూ.1,300, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు రూ.900 చెల్లించాలి. ప్రతి సబ్జెక్ట్‌కి రూ.100 చొప్పున పరీక్ష రుసుం చెల్లించాలి. దివ్యాంగులకు పరీక్ష ఫీజులో రాయితీ ఉంటుంది.
- ఇంటర్మీడియట్‌కు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు, జనరల్ కేటగిరి పురుషులు రూ.1,400, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లు రూ.1,100 అడ్మిషన్ ఫీజు చెల్లించాలి. ప్రతి సబ్జెక్ట్‌కి రూ.200 చొప్పున పరీక్ష ఫీజు, ప్రాక్టికల్స్‌కు ప్రతి సబ్జెక్ట్‌కి అదనంగా రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.

రెగ్యులర్ చదువులతో సమానం



నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్ చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. రెగ్యులర్ ఇంటర్‌తో సమానంగా ఓపెన్ ఇంటర్‌ని పరిగణలోకి తీసుకుంటారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తారు. చదువు మానేసిన వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.
– చంద్రశేఖర్‌బాబు,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణపురం

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్‌కి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 53 కేంద్రాలను ఏర్పాటు చేశాం. వచ్చే నెల 4వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది. చదువుకోవాలని ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి. ఆగిపోయిన చదువులను మళ్లీ కొనసాగించేందుకు ఇది గొప్ప అవకాశం.
–కేంపు హుస్సేన్,
సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త, పల్నాడు జిల్లా

మాచర్లలో ఉచిత కంటి వైద్య శిబిరం





వెల్దుర్తి: మాచర్లలోని మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రిలో ఆదివారం షుగర్ పేషెంట్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వైద్యురాలు అనీషా ప్రియ చెప్పారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రిలో షుగర్ పేషెంట్లకు ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ రెటీనా స్పెషలిస్టు చెంచురెడ్డి, హరితలు షుగర్ వ్యాధితో కంటి చూపు దెబ్బతిన్న వారందరికీ అవసరమైన కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించటం జరిగింది. హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో ఉండే అత్యాధునిక పరికరాలతో ఇప్పుడు మాచర్లలోని రామలింగారెడ్డి మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పెదకాకాని శంకర్ కంటి వైద్యశాల, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి పెరుమాళ్ల రాజేష్ ఆర్థిక సహకారం అందించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. సుమారు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 250 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికి భోజన సౌకర్యం కల్పించారు.

కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేశ్, ట్రెజరర్ గుర్రం కృష్ణకాంత్, ప్రోగ్రాం కన్వీనర్ గర్నె సుబ్రహ్మణ్యం, గద్దం హరికృష్ణ, కాకుమాను శ్రీనివాసరావు, జుజ్జూరి మురళి, శంకర్ కంటి వైద్యశాల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి ఆలయ అధ్యక్షుడిగా భవనాసి

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పాత మాచర్లలోని ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులుగా భవనాసి వెంకటేశ్వరరావు ఎన్నికైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అధ్యక్ష ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత రెండేళ్లగా ఆత్మకూరి పూర్ణచంద్రరావు అధ్యక్షులుగా ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆర్యవైశ్యుల సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య పెద్దలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ యలమంద, కంభంపాటి అనిల్‌కుమార్, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు, చుండూరు సత్యనారాయణ, విడేల కృష్ణ, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఆత్మకూరి నారాయణ, మేడం శ్రీనివాసరావు, పోలా సత్యనారాయణ, యేలూరి విష్ణు, మేడం శివరామకృష్ణ, చెన్నకేశవరావు ఉన్నారు.



దుప్పట్లు, విద్యా సామగ్రి పంపిణీ

చిలకలూరిపేట: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని పేర్కొన్నారు. క్లబ్ సభ్యురాలు చిలుకూరి సుబ్బాయ మ్మ ఆర్థిక సహాయంతో బీసీ బాలుర వసతి గృహంలోని 45 మంది విద్యార్థులకు ఆదివారం దుప్పట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు భారీగా బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఇటీవల గ్రామస్తులంతా ఐక్యంగా పోలేరమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత పోలేరమ్మ తల్లి ఆలయం భక్తులతో కళకళలాడుతోంది.

గ్రామ దేవతలకు పూజలు

మాచవరం: మండలంలోని మాచవరం, పిన్నెల్లి, వేమవరం తదితర గ్రామాల్లో శ్రావణమాస ఆదివారం పురస్కరించుకొని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. మాచవరంలోని పాతపాటేశ్వరీ అమ్మవారికి, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. కుంకుమ బండ్లు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ దేవతలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

గంగమ్మ తల్లికి పండ్లతో అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలో స్వయంభూగా వెలసిన గ్రామ దేవత గంగమ్మతల్లి అమ్మవారి దేవాలయంలో గంగమ్మ తల్లి విగ్రహాన్ని పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం మూడవ ఆదివారం సందర్భంగా గంగమ్మతల్లి అమ్మవారిని పలు రకాల పండ్లు, మొక్కజొన్న కండెలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు విశేషంగా హాజరై మొక్కలను తీర్చుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



